క్లుప్తంగా

యాగంటీశుడికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పల్లకీ సేవ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఆలయంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వర స్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

కొలువుదీరిన పీర్లు



మండపం వీధిలోని చావిడిలో కొలువు దీరిన పీర్లు

అవుకు: మొహర్రం సందర్భంగా అవుకులో పీర్ల దేవుళ్ల చావిడ్లలో కొలువుదీరారు. ఆదివారం నెలవంక దర్శనమివ్వడంతో అవుకులోని మండపం వీధి, తేరువీధి, మార్కెట్ వీధి తదితర ప్రాంతాలలో ఇమామ్ ఖాశీం, తల్లిపీర్లు, మౌలాలి స్వామి, కప్పలగుంతల చావిళ్లలోని పీర్ల పెట్టెలను ఊరేగించారు. అనంతరం పీర్ల దేవుళ్లను కొలువుదీర్చారు.

రైతులను దోచుకుంటే సహించం

సంజామల: రైతులను దోచుకుంటే సహించేది లేదని అగ్రికల్చర్ ప్రత్యేక అధికారి, ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని నొస్సం గ్రామంలో ఉన్న గురుబాలజీ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్స్, బిల్ బుక్స్, ఎరువుల గొడౌన్ తదితర అంశాలను పరిశీలించారు. దాదాపు రూ.63 వేలు విలువగల మందుల విక్రయాలను నిలిపివేశారు. సంజామల ఏఓ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబాన్ని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆదివారం జరిగి రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్వర్ రెడ్డి తనయుడు ధీరజ్ రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న బుగ్గన సోమవారం ఎర్రగుంట్లపల్లి గ్రామానికి చేరుకుని వెంకటేశ్వర్ రెడ్డిని ఓదార్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 40 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు నందివర్గం ఎస్‌ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. చెరువుపల్లె గ్రామానికి చెందిన ధన్‌మోహన్ అనే వ్యక్తి బీరవోలు గ్రామంలో బొలెరో వాహనంలో 40 ప్యాకెట్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడి చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసి వాహన డ్రైవర్ సుహాస్, ధన్‌మోహన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

బేతంచెర్ల: మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకట్రాముడు ద్విచక్రవాహనంపై ఆదివారం రాత్రి బేతంచెర్లకు వస్తుండగా మోడల్ స్కూలు వద్ద కర్నూలు వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట్రాముడుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. బాధితుడి భార్య నల్లబోతుల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుంబాషా సోమవారం తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

డోన్ టౌన్: పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ భారతి అన్నారు. స్థానిక జీవీఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వివేకానంద సేవా సమితి వారి ఆధ్వర్యంలో రూ.30వేల విలువజేసే 50 కుబంద మొక్కలు నాటారు. అలేగే.. వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేందుకు నీటి గుంతలను ఏర్పాటు చేశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

బేతంచెర్ల: గూటుపల్లె గ్రామానికి చెందిన వడుమూరి రాజు (24) కామెర్ల వ్యాధితో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడు మూగవాడు కావడంతో పాటు ఎవ్వరు లేకపోవడంతో స్థానికుల విన్నపం మేరకు ఆనలుగురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషా సోమవారం పోలీసుల అనుమతితో సభ్యులు లక్ష్మీ రాఘవ, అక్బర్, మా బాషాతో కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆలయంలో చోరీ

బేతంచెర్ల: పట్టణ సమీపంలోనున్న అయ్యప్ప స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం ముందుకున్న గేటు తాళం, గర్భగుడి తాళాన్ని పగులగొట్టి లోపలికి వెళ్లి రూ.2లక్షల విలువజేసే వినాయక, సుబ్రహ్మణ్య స్వామి పంచలోహ విగ్రహాలు, సెటారి, రూ.14 వేల నగదు, బంగారు పూత రేకు, రెండు కనుగుడ్లు, వెండి కోరలు చోరీ చేసినట్లు నిర్వాహకులు బచ్చు సుబ్రహ్మణ్యం, చిన్ని కృష్ణ తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శివశంకర్ నాయక్ సిబ్బందితో వెళ్లి ఆలయాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

చిరస్మరణీయుడు వైఎస్సార్

● వాడవాడలా వైఎస్సార్ జయంతి

డోన్: ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు, పాలనతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా వైఎస్సార్ నిలిచిపోయారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి పేర్కొన్నారు. తన స్వగృహంలో సోమవారం మహానేత జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపేద ప్రజల సౌకర్యం కోసం కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, కురకుంద హరి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. అలాగే.. స్థానిక కంబాలపాడు సర్కిల్, కోట్లవారి పల్లెలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లెంపల్లె రామచంద్రుడు, మల్యాల శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాపదిన్నె నరసింహారెడ్డి, కొచ్చెర్వు మధురెడ్డి, చింతలపేట గంగాధర్ రెడ్డి, ఉడుములపాడు శ్రీనివాసరెడ్డి, వెంకటాపురం మధురెడ్డి, గుమ్మకొండ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బద్దల నాగరాజు, బుగ్గన జయచంద్రారెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, పార్టీ నాయకులు పోస్టుప్రసాద్, ఆర్‌ఈ రాజవర్ధన్, ధర్మవరం శ్రీను, శ్రీనివాసులు యాదవ్, వెంకటనాయునిపల్లె మనోహర్, రాజు, సోమేష్ యాదవ్, శేఖర్ యాదవ్, ఓబులాపురం మదన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.



కంబాలపాడు సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి బుగ్గన

విద్య, ఉపాధి రంగాలలో అగ్రగామిగా డోన్..

వైఎస్సార్ హయాంలో డోన్‌కు మోడల్, ఏపీ గురుకుల, కస్తూర్బా విద్యాలయాలను మంజూరు చేశారని బుగ్గన గుర్తుచేశారు. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఉర్దూ పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ, జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలతో పాటు కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఐటీఐ విద్యార్థుల కోసం అత్యాధునిక వసతులతో వసతి గృహం నిర్మించామన్నారు. ఉపాధి రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు కియా కంపెనీ సహకారంతో పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు పలు కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించామన్నారు. రూ.312 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన నీటిని నియోజకవర్గానికి అందించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. అన్ని గ్రామాలకు నూతన రహదారులను ఏర్పాటు చేయడంతో పాటు చెరువులను హంద్రీనీవా నీటితో నింపిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

బేతంచెర్ల : అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల హృదయాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం వైఎస్సార్ జయంతిని మండలంలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శేషారెడ్డి హైస్కూలు ఎదురుగానున్న ఆయన విగ్రహానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, నాయకులు బాబుల్ రెడ్డి, ఖాజా, మురళీకృష్ణ, రామచంద్రుడు, నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రంగస్వామి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శేఖరయ్య, గూని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, బలరాముడు, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, కిరణ్, నిరంజన్, ఖాజ, సలీమ్, మధుసూదన్‌రెడ్డి,తిమ్మయ్య, సత్యం, యాకోబ్, భాస్కర్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లు, కౌన్సిలర్‌లు చింతల నాగిరెడ్డి, మధు, ఇబ్రహీం, కోట్ల మధు, గోరుమానుకొండ, ఆర్‌ఎస్ రంగాపురం సర్పంచ్ గుమ్మగాల రాజు, ఎంపీటీసీలు నాగశేషు, రామ చంద్రారెడ్డి పాల్గొన్నారు. అలాగే.. ఆర్‌ఎస్‌రంగాపురం గ్రామంలో సర్పంచ్ గుమ్మగాల్లరాజు, ఎంపీటీసీ నాగశేషు, నాయకులు తిమోతి, తిమ్మయ్య, మాబ్, మనోహర్, శ్రీనివాసులు రెడ్డి, గంగాధర్‌రెడ్డి, సిమెంట్ నగర్‌లో యాకోబ్, యోబ్, జాకబ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

డోన్ రూరల్ : వైఎస్సార్ జయంతి సందర్భంగా చిన్న మల్కాపురం గ్రామంలో మాజీ ఎంపీటీసీ బద్దల నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వలసల హనుమంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సి.మద్దయ్య, ఎం,మద్దయ్య, పాల్గొన్నారు.



కోట్లవారిపల్లెలో వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బుగ్గన



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: పేదల గుండెల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్థానం సుస్థిరమని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, పోతుదొడ్డి కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. నాయకులు రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, వి. శ్రీనివాసరెడ్డి, రాజా మురళీకృష్ణ, బోరెడ్డి రాము, అలేబాదు బాలయ్య, కొండయ్య, బషీర్, జెర్రిబండ సుబ్బారెడ్డి, ధనుంజయశెట్టి, అంజి, ప్రభాకర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, చిన్నపుల్లారెడ్డి, శింబిరెడ్డి, ఎర్రిస్వామి, రామసుబ్బయ్య, రామకృష్ణ, భాస్కర్ రెడ్డి, రామ్మూర్తి, నాగరాజు, పెద్దయ్య, బాలాంజనేయులు, రంగనాయకులు పాల్గొన్నారు.



బేతంచెర్లలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆర్ ఎస్ రంగాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



సిమెంట్ నగర్‌లో..



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పేదవాడి గుండె చప్పుడు వైఎస్సార్

బనగానపల్లె : దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి పేదవాడి గుండె చప్పుడని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని గ్రామ గ్రామానా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటి వద్ద అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ లక్ష్మీసుబ్బమ్మ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు జయంతి ఉత్సవాల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ముస్లింలకు 4శాతం రిజర్వేషన్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ 104 ఇంకా మరెన్నో పథకాలను అమలు పరచి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రవికుమార్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ దీవెనమ్మ, సర్పంచ్ మోహన్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెట్రోల్ కూడలిలో, అవుకు మెట్ట కూడలిలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుకూరులో వైఎస్సార్ చిత్రపటానికి రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, పూలమాలవేసి నివాళులర్పించారు. టంగుటూరులో, యనకండ్ల, నందవరం, నందివర్గం, తిమ్మాపురం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో అల్లెసురేష్‌రెడ్డి, అల్లె సుప్రజ, సురేష్ కుమార్‌రెడ్డి, మహానందిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, పెద్దశివారెడ్డి, కాటసాని పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

కోవెలకుంట్ల: మహానేత వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక పవన్ ఏజెన్సీ సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గుద్దేటి సుధాకర్‌రెడ్డి, అక్బర్‌బాష, రాంభూపాల్‌రెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని భీమునిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరా నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రుషికేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి రామిరెడ్డి, కర్నాటి నాగేశ్వరరెడ్డి, హనుమంతు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆకుమల్ల గ్రామంలో మాజీ సొసైటీ బ్యాంక్ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్‌రెడ్డివై వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఉయ్యాలవాడ ఖాశింబాషా అధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆకుమల్ల గ్రామ ఉప సర్పంచ్ హాజీపీరా, పీఎంసీ చైర్మన్ ఉసేని, నాయకులు ధర్మారెడ్డి, శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.



కాటసాని రామిరెడ్డి ఇంటి వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వైఎస్సార్ పాలన సువర్ణాధ్యాయం

కొలిమిగుండ్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన సువర్ణాధ్యాయమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. మహానేత జయంతిని పురస్కరించుకొని సోమవారం కొలిమిగుండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం నాయకులతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకొని నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే రైతుల కోసం ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేశారని, నేటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ అమలు అవుతుందని గుర్తు చేశారు. ప్రతి ఎకరాకు నీళ్లు అందించాలనే సంకల్పంతో జలయజ్ఞ పేరుతో వేగంగా ప్రాజెక్టులు పూర్తి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అవుకు తిమ్మరాజు చెరువును రిజర్వాయర్‌గా మార్చి నాలుగు టీఎంసీల నిల్వ చేసే స్థాయికి తీసుకు వచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు చేసి ఎంతో మంది పేదల ప్రాణాలు నిలబెట్టారని అన్నారు. ఆయన మృతి చెంది 15 ఏళ్లు అయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని పేర్కొన్నారు.



కోవెలకుంట్లలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుళ్లదూర్తిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆకుమల్లలో వెఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తిమ్మాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభిమానులు



కోవెలకుంట్లలో విద్యార్థులకు మిఠాయిలు పంచుతున్న దృశ్యం

మంత్రి బీసీని కలిసిన జిల్లా కలెక్టర్

బనగానపల్లె రూరల్ : నంద్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజకుమారి గణియా రాష్ట్ర రోడ్లు భవనాల, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం బనగానపల్లెలోని మంత్రి బీసీ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకొని మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

పార్టీ శ్రేణులతో మంత్రి సమీక్ష

కొలిమిగుండ్ల: రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి సోమవారం బెలుం గుహల ఆవరణలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. మంత్రి అయ్యాక మొదటి సారి మండలానికి రావడంతో పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా చర్చించి, వారి అభిప్రాయాలు స్వీకరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి, నాయకులు వీఆర్ లక్ష్మిరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి బీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన కలెక్టర్ రాజకుమారి గణియా

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

బనగానపల్లె రూరల్ : పశుగ్రాస విత్తనాలపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మారుతి సకారామ్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సోమవారం బనగానపల్లెలోని రైతులకు పశుగ్రాస విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు జొన్న, మొక్కజొన్న పశుగ్రాస విత్తనాలను 75 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో అపహరణ

కోవెలకుంట్ల: పట్టణంలోని గుంజలపాడు రహదారి సమీపంలో టాటా ఏసీ ఆటో అపహరణకు గురైంది. సోమవారం ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్లకు చెందిన రవితేజ ఆటో పార్కు చేసి ఉంచగా ఈ నెల 2వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను తీసుకెళ్లారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆటో ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చెత్తబుట్టలు మంజూరు

ప్యాపిలి: స్వచ్ఛభారత్ కింద మండలానికి 20 వేల చెత్తబుట్టలు చేరినట్లు ఈఓఆర్డీ బాలకృష్ణుడు సోమవారం తెలిపారు. మండలంలో 16 వేల ఇళ్లకు గాను ఇంటికి రెండు బుట్టలు చొప్పున మొత్తం 32 వేల చెత్త బుట్టలు రావాల్సి ఉందన్నారు. అయితే సోమవారం 20 వేల చెత్త బుట్టలు వచ్చినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బెలుం గ్రామానికి చెందిన రమణయ్య కుమారుడు శేఖర్ (24) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సంజామల మండలం తుడుములదిన్నెలో వివాహం చేసుకోవడంతో ప్రస్తుతం అత్తగారింట్లోనే ఉంటున్నాడు. డ్యూటీ ముగించుకొని అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి బైక్‌లో ఊరికి బయలు దేరాడు. ప్రధాన రహదారిలోని స్కూల్ వద్దకు చేరుకోగానే రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి ఎదురుగా వస్తున్న జీపు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

బోగస్ పింఛన్లపై విచారణ

ప్యాపిలి: మండలంలోని బూరుగల పంచాయతీ పరిధిలో నాలుగు బోగస్ పింఛన్లు ఉన్నట్లు ఫిర్యాదులు అందాయని ఎంపీడీఓ సాయిమనోహర్ సోమవారం తెలిపారు. ఆధార్ కార్డుల్లో పేర్లు మార్చుకోవడంతో పాటు వయస్సు ఎక్కువ నమోదు చేయించుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు సదరు పింఛన్లపై విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. బోగస్ పింఛన్లు తీసుకుంటున్న వారికి నోటీసులు అందజేసి పింఛన్లు ఎందుకు ఆపకూడదో వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. విచారణలో బోగస్ పింఛన్లుగా తేలితే వెంటనే ఆపివేస్తామని స్పష్టం చేశారు.

విధుల్లోకి తీసుకోవాలి

బనగానపల్లె రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రి లోకేష్ ఎన్నికల ముందు బీమా మిత్రలకు ఇచ్చిన హామీ మేరకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన బీమా మిత్రలు రాష్ట్ర రోడ్లు భవనాల, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామానికి చెందిన వీణ అనే వివాహిత తన భర్త మనోజ్‌కుమార్, అత్తా మామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. వీణకు అనంతపురం పట్టణానికి చెందిన మనోజ్‌కుమార్‌తో సంవత్సరం క్రితం వివాహం అయింది. అయితే కొద్ది నెలల నుంచి తను అదనపు కట్నం తీసుకురావాలని తల్లిదండ్రులతో కలిసి మనోజ్‌కుమార్ వేధింపులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు భర్త, అత్తామామలతో పాటు మరో ఇద్దరు కుటుంబ సభ్యుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

విత్తన అమ్మకాల నిలిపివేత

కోవెలకుంట్ల: వివిధ రకాల విత్తనాల అమ్మకానికి సంబంధించి సరైన ఆధారాలు చూపించకపోవడంతో రూ.2.93 లక్షల విలువ చేసే విత్తనాల విక్రయాలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నంద్యాల ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి సిద్ధయ్య, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, నంద్యాల, కోవెలకుంట్ల వ్యవసాయాధికారులు ప్రసాదరావు, నిరంజన్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల పట్టణంలోని ఎరువులు, విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు షాపుల్లో విక్రయాలకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతో అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. వారు మాట్లాడుతూ విత్తన డీలర్లు అధీకృత, నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని హెచ్చరించారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహార మందుల విక్రయాల సమయంలో కచ్చితంగా రసీదులు ఇవ్వాలని సూచించారు.



విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పదవీవిరమణ సాధారణం

డోన్ టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణమని ఆర్డీఓ మహేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన రాజశేఖర్ బాబు సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాజశేఖర్‌బాబును సత్కరించారు. డోన్,ప్యాపిలి,బేతంచెర్ల తహసీల్దార్లు మాధవకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జీవన్ చంద్రశేఖర్, డోన్ డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, రెవెన్యూ సంఘం జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గిరికుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



రాజశేఖర్‌బాబును సన్మానిస్తున్న ఆర్డీఓ

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్యాపిలి: మొహర్రం పూజలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం పీర్ల చావిడి నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కులమతాలకు అతీతంగా జరిగే మొహర్రంలో తగిన బందోబస్తు చర్యలు చేపడతామన్నారు. అయినప్పటికీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనే కార్యక్రమంలో పట్టణంలోని 14 పీర్ల చావిళ్ల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. చావిడి ముందు ఏర్పాటు చేసే అగ్నిగుండం విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బేతంచెర్ల: లయన్స్ క్లబ్ 2024-25 పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులు మధుసుధాకర్ రెడ్డి, రాఘవేంద్ర రాజు, కోశాధికారి మనోహర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మట్టా రాజేష్, ప్రవీణ్ కుమార్, విష్ణు, సుదర్శన్, మురళీ, రమేష్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు భావనాసి నాగమహేష్, మహేశ్వరరెడ్డి, రవిప్రకాశ్ వారికి అభినందనలు తెలిపారు.